# ఎవరిపని వారిదే



చాలా రోజుల కిందటి సంగతి. గంగానదికి విపరీతంగా వరదలు వచ్చాయి. పంట పొలాలన్నీ పాడయిపోయాయి. ఊళ్ళకు ఊళ్లే కొట్టుకు పోయాయి. చాలా ప్రాణ నష్టం జరిగింది. ఆస్తి నష్టమూ చాలానే ఉన్నది. అలాంటి సమయంలో ఓ సంఘటన జరిగింది.

అదేమిటంటే—

కొంతమంది పల్లెకారులు నదిలో కొట్టుకు పోతున్న కలపను అతి కష్టం మీద ఒడ్డుకు చేరుస్తున్నారు. అలా సేకరించిన కలపను కారుచౌకకు మరి కొంతమంది కొంటున్నారు కూడా.

ఇంకో చెంప కొందరు బెస్తలు చేపలు పడుతున్నారు. వరద నీటికి చేపలు ముమ్మరంగా వస్తాయి కదా! కొంతమంది దయామయులు గజ ఈతగాళ్లను నియమించారు. వరదలో కొట్టుకు పోతున్న వారినీ, కొట్టుకు పోతున్న పశువులనూ ఒడ్డుకు చేరుస్తున్నారు. నదీ తీర మంతటా చాలా హడావుడిగాను, సందడిగాను ఉన్నది.

అవునా !

ఇవేమీ పట్టనట్లుగా ఒక సన్యాసి దూరంగా ముక్కు మూసుకొని కూచున్నాడు. అతను ఎక్కడివాడో తెలీదు. ఎప్పుడు ఆ ప్రాంతానికి వచ్చాడో అంతకన్నా తెలీదు, మనిషి బాగా ముసలివాడు. తలా గడ్డమూ తెల్లగా నెరిసి పోయాయి. ఒకరిద్దరు పిల్లలు ఆయనగారికి అల్లంత దూరంగా ఉండి, వారిని చిత్రంగా చూశారు. ఎంతకీ వారు కదలక పోయేసరికి, వారికి విసుగెత్తింది కాబోలు వెళ్ళిపోయారు. ఆ సన్యాసి లేచాడు. మెల్లగా నది ఒడ్డుకు వచ్చాడు. నదిలో కొట్టుకు పోతున్న చెట్లను, పశువులనూ మనుషులనూ, చూశాడు. కానీ తను చేయగలిగిందేమీలేదు. ఓ నిట్టూర్పు విడిచాడు.

అంతలోనే చెట్టుకొమ్మ మీది నుండి ఒక తేలు నీటిలో జారి పడి పోయింది. ఆ సన్యాసి ప్రాణం విలవిలలాడి పోయింది. ఓ అడుగు ముందుకు వేసి, ఆ తేలును తీసి ఒడ్డున పడవేశాడు. ఆ తేలు అయన్ను అంట కుట్టింది. బాధను ఆయన అలాగే భరించాడు. ఒడ్డున పడిన తేలు గట్టుమీదికి పాకుతున్నప్పుడు, పట్టు తప్పి మళ్ళా నీళ్ళలో పడి

పోయింది. రెండవసారి కూడా ఆ సన్యాసి తేలును తీసి గట్టుకు చేర్చాడు. దురదృష్టవశాత్తు ఆ తేలు మూడవసారి కూడా నీటిలో పడిపోయింది. ఆ సన్యాసి మూడవసారి కూడా దాన్ని నీటి నుండి వెలికి తీశాడు. అలా తీస్తున్న ప్రతిసారి అది కుడుతూనే ఉన్నది.

ఇదంతా చూస్తున్న ఒక కుర్రవాడు, ఆ యోగిని ఏమని అడిగాడంటే—

"అయ్యా, మీరు మూడుసార్లు తేలును బైట పడేశారు. ఆ మూడుసార్లూ అది మిమ్మల్ని కుట్టింది. మళ్ళీ మీరెందుకు ప్రయత్నం చేస్తారూ?" అన్నాడు.

"బాబూ! కుట్టటం దాని స్వభావం కనుక కుడుతున్నది. ఆపదలో ఉన్న ప్రాణిని రక్షించడం మానవధర్మం కనుక, నేను కాపాడుతున్నాను" అన్నాడు యోగి.

వారు అలా వివరంగా చెప్పిందాకా, యోగి చేస్తున్న పనికి అర్థం లేదనే అనుకొన్నాడు ఆ కుర్రవాడు.

—o—